# నమ్మకం

**- ఆల్ ఇండియా రేడియో, 1979**

"భగవంతుడిమీద నమ్మకం,
మనిషికి మనశ్శాంతిని, మనోధైర్యాన్ని ఇస్తుంది.
భగవంతుడితో ముడిపడ్డ మూఢనమ్మకం
మనిషిని నిలువుదోపిడీ చేస్తుంది."

"త్వరగా లే, త్వరగా లే గౌతమ్" నేను ఎంత కంగారుగా ఎంత మొరటుగా లేపానో!... ఒక్క జంప్‌లో లేచి నిల్చున్నాడు గౌతమ్. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. ఆ మసక వెలుతురులో మా పాదాలను తడుపుతూ చల్లటినీరు. సముద్రతీరాన నేనప్పు డప్పుడూ అనుభవించే ప్రియమైన నీటిస్పర్శ, బయట నిన్నటినుండీ కురుస్తున్న వర్షం సవ్వడి, వీస్తున్న గాలి తాలూకు హోరు.

కొన్ని క్షణాల్లోనే సర్వం మా ఇద్దరికీ అర్థమయిపోయింది. నా శరీరంలో ప్రతి అణువూ వణికింది. ఎక్కడో మచిలీపట్నం సముద్రంలో పుట్టిన వాయుగుండం, మాదాకా రాదని రేడియో వార్తలను నిర్లక్ష్యంచేసి నిశ్చింతగా నిద్రపోయిన మాకు ఇది ఊహించని పరిణామం.

"గౌతమ్! నీళ్ళు" గొణిగాను. గౌతమ్ కదిలాడు. భయంగా అతని చెయ్యి పట్టుకుని ఆపేసాను.

"వెళ్ళనీ హసన్. బయటేం జరుగుతుందో నన్ను చూడనీ" మెల్లగా తలుపులు తెరిచాడు గౌతమ్. రివ్వున గాలి, దానితోపాటు, తలుపు కవతల ఎదురు చూస్తున్న

నీరు మా చిన్న ఇంట్లోకి దూసుకొచ్చాయి. అల్లంతదూరాన పొంగిన సముద్రం, నురగలు కక్కుతూ, పరుగున వస్తోంది... మా గుండెల్లో అది ప్రవహిస్తోంది.

ఎదురుగా నిముషనిముషానికీ పైకి లేస్తున్న నీటిమట్టం.....

"ఓ గాడ్!"... నేను భగవంతుణ్ణి నమ్ముతున్నానా? నా అంతరాంతరాల్లో భగవంతుని ఉనికిమీద, నా సందేహపు పొరలవెనక, ఇంకా ఏదో కొంత నమ్మకం మిగిలిపోయిందా? లేక నా ప్రాణం, నా బిడ్డ ప్రాణంకంటె నా దృష్టిలో విలువైందా?

* * * * *

ఒకరోజు గౌతమ్ తనను బ్రతిమిలాడాడు. 'భగవంతునిమీద భారం వెయ్యి గౌతమ్ నీ బిడ్డ బ్రతుకుతుంది' అని. అతనికి తెలుసు స్నేహితుడు భగవంతుణ్ణి నమ్మడని. అయినా అతనికి భగవంతునిమీద వున్న నమ్మకం, వాడిచేత తనకా సలహా ఇప్పించింది.

తను నవ్వాడు చాలా విరక్తిగా, అశాంతిగా నవ్వాడు.

'చూడు హసన్! నువ్వు భగవంతుణ్ణి నమ్ము. భక్తితో నీ మనసును జోడించు. ఆ భక్తి నిన్ను రక్షిస్తుంది.'

'ఎలా?'

ఉత్సాహంగా చూసాడతను.

'మనం ఒకరిని ప్రేమించామనుకో. ఆ ప్రేమించబడ్డవాళ్ళు మనకేదో చేయరు హసన్. ఆ ప్రేమ భావమే మనకు చైతన్యాన్నిస్తుంది. ప్రాణం పోస్తుంది. ఇదీ అంతే.' లేని భగవంతుణ్ణి, ప్రాణమున్న మనుషుల ప్రేమతో పోల్చాలనిపించలేదు తనకు. మౌనంగా ఆ సంభాషణకు ముగింపు వాక్యం పాడేసాడు.

* * * * *

నీటి తుంపరను మోసుకొచ్చిన గాలి, నన్ను తట్టింది. ఉలిక్కిపడి తేరుకుని ఎదురుగా చూసాను. ఆహ్వానించని అతిథిగా మా ఇంటి వాకిటి ముందు కొచ్చేసాడు సాగరుడు.

"మూసెయ్ గౌతమ్! తలుపు మూసెయ్."

గౌతమ్ మౌనంగా తలుపుమూసి లోపలికి నడిచాడు. నేను విమూఢిడిలా అక్కడే నిల్చున్నాను.

'అయిపోయింది. పాతిక సంవత్సరాలుగా పాఠాలు చెప్పుకుంటూ, బదిలీలమీద ఈ మారుమూల పల్లెకు చేరిన మా జీవితాలు, దిక్కూ, మొక్కూ లేకుండా అంతం కాబోతున్నాయి. భార్యాబిడ్డల ఒడిలోకాక తుఫాను బీభత్సంతాలూకు ప్రళయ హేలలో ఆఖరి ఊపిరి తీసుకోబోతున్నాము.'

నా వెనగ్గా పెరుగుతున్న నీటిమట్టం. నన్ను ముందుకు తోసింది. వణికిపోతూ లోపలికి పరుగెట్టాను.

"గౌతమ్! తుఫాను, మన పల్లెను కూడా ముంచేలా వుంది!" నాకు బ్రతకాలనే కోరిక బలంగా వుంది.

నేను అంతవరకు గమనించలేదు. భగవంతుని పటంముందు నిశ్చలంగా, కళ్ళు మూసుకుని, చేతులు జోడించి నిల్చోనున్నాడు గౌతమ్.

"గౌతమ్!" గౌతమ్ కళ్ళు తెరవలేదు. అతని ఛాతి భక్తితోనో, భయంతోనో పైకి, క్రిందికి ఊగుతోంది.

"గౌతమ్!" భుజం పట్టుకుని కుదిపాను. ఉలిక్కిపడ్డట్టు కళ్ళు తెరిచాడు. నాకు విపరీతమైన ఆశ్చర్యంగా వుంది.

"నాలో వున్నంత భయం అతనిలో లేదేం?" గౌతమ్, మా కాళ్ళక్రింద పెరుగుతున్న నీటిమట్టం చూసాడు. బయటగాలి, నీరు కలసి చేస్తున్న భయంకరమైన హోరు విన్నాడు. ఊగుతున్న తలుపు తెరిచి చూసాడు. బయట భూమి కన్పించడం లేదు. 'అంటే... అంటే మా వెనక సముద్రానికి దగ్గరగా వున్న పల్లెలన్నీ, మునిగిపోయుంటాయి. ఇంకొన్ని క్షణాల్లో ఈ పల్లె కూడా....' ఊహా మాత్రానే వణికిపోయాను.

మా కళ్ళముందే, విపరీతమైన ఒరవడితో నీరు మా ఇంట్లోకి ప్రవహించి మోకాలు లోతు నీటిని నిలిపింది. గౌతమ్ శూన్యంలోకి చేతులు జోడించాడు. తను నమ్మే భగవంతుణ్ణి ఏమని ప్రార్థించుకున్నాడో, మరికాస్త ధైర్యాన్ని కూడగట్టుకుంటూ అన్నాడు.

"రా దూలం మీదికెక్కేద్దాం."

"అతని చెయ్యి గట్టిగా పట్టుకున్నాను నేను. దూసుకొస్తున్న నీటిలాగే నా శిరల్లో, ధమనుల్లో రక్తం వేగంగా ప్రవహించసాగింది. నేను వణికే కాళ్ళతో, బ్రతకాలనే కోరికతో, దూలంపైకి ఎక్కసాగాను. ఎక్కుతూ, ఎక్కుతూ వెనక్కు తిరిగి, కంపించిపోతూ అన్నాను.

"ఈ ఇల్లు కూలిపోతుందేమో గౌతమ్!"

"భయపడకు హసన్. ఎలా జరగాల్సి వుంటే అలా జరుగుతుంది. మన ప్రయత్నం మనం చేద్దాం. మనం దేనిని ఆపగలం చెప్పు. మన ఖర్మ ఎలా వుంటే అలా జరుగుతుందిగానీ."

నేను విస్తుపోయాను. 'నేను అసహ్యించుకుని, నిషేధించే ఖర్మ సిద్ధాంతం, నా స్నేహితుడికి ఎంత మనోధైర్యాన్నిస్తోంది!'

ఆ పాతకాలపు దూలంమీద ముడుచుకుకూర్చున్న మా ఇద్దరిలోనూ, భయం వుంది. కానీ నాలోవున్న నైరాశ్యం, నా స్నేహితుడిలో లేదు.

"హసన్! చూడు. నీటిమట్టం తలుపుకు సగానికి వచ్చేసింది. ఇంకా మనం ఆగితే ఆ తలుపును అది పూర్తిగా ఆక్రమించుకుంటుంది. మనం బయటకు పోయే మార్గం కన్పించదు."

హిమాలయ పాదప్రాంతాల మంచు శిలలా అయిపోయింది నా శరీరం.

"అయితే.... అయితే.... ఏం చేద్దామంటావు గౌతమ్."

"దూకేసి ఈదుకుంటూ వెళ్ళిపోవడమే."

"ప్రవాహానికెదురుగా, ఆ చిన్న తలుపుగుండా ఈదుకుంటూ వెళ్ళగలమంటావా?" నన్ను చావుభయం పూర్తిగా చుట్టేసుకుంది.

"భగవంతుణ్ణి ప్రార్థించుకో హసన్! తప్పకుండా ఈదగలం."

"మనిద్దరం ఒకేసారి వెళ్తున్నాం గౌతమ్!"

"ఫరవాలేదు హసన్! మనం మరలా పైన కలుసుకుంటాం."

'భగవంతుడున్నాడనే నమ్మకం నీకెంత సాయం చేస్తోంది గౌతమ్. ఎంత అదృష్టవంతుడివి నేస్తం నువ్వు!'

"మనం పొరపాటు చేసాం హసన్. కొద్ది నీరు లోపలికి రాగానే మనం ఈ ఇల్లు వదిలి వుండాల్సింది."

"నిజమే... నిజమే..." నా మనసు గొణిగింది. నా హృదయం రోదిస్తోంది. "దీపావళి పండక్కెళ్ళిన మా భార్యాపిల్లలు ఏం భయపడుతున్నారో!"

"గౌతమ్!" పిలిచాను.

"మన తర్వాత, మనవాళ్ళు ఎలా బ్రతుకుతారు గౌతమ్."

"అవన్నీ ఆలోచించకు హసన్. భగవంతుడున్నాడు. ఆయన వాళ్ళను చల్లగా చూస్తాడు." గౌతమ్ నీటిలోకి నన్నునెట్టి తనూ దూకేసాడు.

* * * * *

ఇద్దరం మౌనంగా, ఒంట్లో శక్తినంతా కాళ్ళల్లోకి, చేతుల్లోకి తెచ్చుకుని ఈదు

తున్నాం. ఆయాసం వచ్చేస్తోంది. ఇంక ఎంతోసేపు ఈదలేనని నాకు తెలిసిపోతోంది. కనుచూపుమేరలో ఒడ్డులేదు. గౌతమ్‌వైపు చూసాను. అతనూ అలసిపోయిన సూచనగా, అలలను ఎదుర్కోలేక, మునుగుతూ తేలుతూ వున్నాడు. అంటే.... మేమిద్దరం తెలిసి తెలిసి ఒక మరే దారీలేక మృత్యుద్వారం ముంగిట కెదురుగా వెళుతున్నాం.

నన్ను మగత క్రమక్రమంగా చుట్టేస్తోంది. నాకు తెలుసు మరో కొన్ని నిమిషాల్లో నిస్సహాయంగా, నిరాధారంగా, నికృష్టంగా తెలిసి తెలిసీ ఈ నిశ్శబ్దంలో, ఈ ప్రవాహంలో కలిసిపోతాను... నాకు తెలుసు. నా వెనుక గౌతమ్ కూడా వస్తాడు... కానీ గౌతమ్‌లోని మరో జన్మమీది నమ్మకం నాలో లేదు.

భగవంతుడి ఉనికి గురించి నాకు ఇప్పుడూ నమ్మకం కలగలేదు. అయినా ఆ నమ్మకం మనిషికింత శాంతిని, ఆశను కలిగిస్తుందని తెలుసుంటే, భగవంతుడు లేడని నేనెవరితోనూ అనే వాడినీ కాదు. నమ్మించాలని ప్రయత్నించేవాడినీ కాదు. కానీ సమయం మించిపోయింది.

నా కళ్ళు మూతలు పడిపోతున్నాయి. నన్ను అయోమయంలాంటి భావం చుట్టేసింది. నేను నీరు మింగేస్తున్నాను....

ఆ తర్వాత నాకు తెలీదు.